క్లుప్తంగా

కృష్ణావతారంలో జగన్నాథుడు


మునగపాకలో జగన్నాథుని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు శనివారం కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆయా గ్రామాల్లోని జగన్నాథుని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. నాగులాపల్లిలో ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆదివారం జగన్నాథస్వామి పండగను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఏఎన్ఎం గుణకు సత్కారం


బదిలీపై వెళ్తున్న ఏఎన్ఎం గుణను సత్కరిస్తున్న నాయకులు

మునగపాక: విధి నిర్వహణలో అంకిత భావంతో సేవలందించేవారికి తగిన గుర్తింపు ఉంటుందని నాగులాపల్లి మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు అన్నారు. నాగులాపల్లి సచివాలయ ఏఎన్ఎంగా పని చేసిన వెలగా గుణ బదిలీ కావడంతో శనివారం ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో గుణ ప్రజలకు మెరుగైన సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు కర్రి సత్యనారాయణ, భీమారావు, భాస్కరరావు, కర్రి వాసు, మళ్ల ఉమాకాశీ, మళ్ల కన్నుంనాయుడు, రాంజీ, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి విరాళం


వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న భక్తుడు

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో తలపెట్టిన వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ఆలయానికి పలువురు దాతలు తమవంతు సాయం అందజేస్తున్నారు. శనివారం మునగపాక బీసీ కాలనీకి చెందిన బుద్ద వెంకట పరదేశినాయుడు, సత్యవతి దంపతులు రూ.5వేల నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెలగా శ్రీనివాసరావు, పెంటకోట ఉమేష్, బొడ్డేడ రామునాయుడు, షకిరమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన సప్తాహం


మునగపాక సాయిబాబా ఆలయంలో సప్తాహం చేస్తున్న భక్తులు

మునగపాక: మునగపాక సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్న సప్తాహం శనివారం రెండో రోజుకు చేరుకుంది. పలు గ్రామాలకు చెందిన భజన బృందాలు ఇక్కడ భజనలు చేస్తున్నారు. సాయి నామస్మరణతో మునగపాక మార్మోగుతుంది. గురు పౌర్ణమిలో భాగంగా ఈ నెల 10న ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బొడ్డేడ వీరేంద్ర తెలిపారు.

మెగా పీటీఎంను విజయవంతం చేయాలి


పేరెంట్స్ మీటింగ్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మహేష్

పాయకరావుపేట: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 10న జరగబోయే మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్(పీటీఎం)ను విజయవంతం చేయాలని తహసీల్దార్ ఎస్.మహేష్ కోరారు. మండల రెవెన్యూ కార్యాలయంలో పేరెంట్స్ మీటింగ్ కమిటీ సభ్యులతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేరెంట్స్ మీటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలని మండల విద్యాశాఖ అధికారులు కెవిన్ గాంధీ, రమేష్ బాబులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక పోలీసు సిబ్బంది, మండల పరిషత్ ఏవో సిహెచ్.ఆర్.కె.వర్మ పాల్గొన్నారు.

అన్నదాత.. ఎదురుచూపులు

- ఏడాదికి రూ.20వేల సాయమంటూ కూటమి ప్రభుత్వం హడావుడి
- ఏడాది దాటినా రైతన్నకు అందని పెట్టుబడి సాయం
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఏటా రూ.13,500 ఠంచన్‌గా అందజేత


మునగపాకలో వ్యవసాయ దుక్కు చేస్తున్న రైతు

మునగపాక: వ్యవసాయం అంటేనే గుర్తుకు వచ్చేది మహానేత రాజన్న పేరు. అతనికి తగ్గ తనయుడుగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా నిలిచారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం గత వైఎస్సార్‌సీపీ హయాంలో సకాలంలో వ్యవసాయ పెట్టుబడులకు రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 అందజేసేవారు. కూటమి ప్రభుత్వం ఈ పథకానికి అన్నదాత సుఖీభవ పథకంగా పేరు మార్చి అధికారంలోకి వస్తే ఏటా రూ.20 వేలు అందజేస్తామంటూ ప్రచారం చేసింది. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇంతవరకు నయా పైసా పెట్టుబడి సాయం అందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పంటల సాగు ఇలా..

మండల వ్యాప్తంగా చెరకు, వరి ప్రధాన పంటలుగా సాగవుతున్నాయి. వరి, చెరకుతో పాటు ఇతర పంటల సాగు ప్రస్తుతం 3697 హెక్టార్లు. చెరకు 1087 హెక్టార్లు కాగా వరి 1456 హెక్టార్లు సాగు చేస్తున్నారు. 1188 హెక్టార్ల మేర ఇతర పంటల సాగు చేపడుతున్నారు. గతంలో చెరకులో తెగుళ్ల బెడద ఎక్కువగా ఉండడంతో రైతులు వరి సాగుపై మక్కువ చూపుతూ వస్తున్నారు.

వైఎస్ జగన్ హయాంలో సాయం ఇలా..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి ఏటా రైతు భరోసా పథకాన్ని పక్కాగా అమలు చేశారు. ఈ పథకం కింద అర్హులైన రైతులను గుర్తించి వారికి ఏటా వ్యవసాయ పెట్టుబడుల కింద రూ.13,500 అందజేసేవారు. మూడు దఫాలుగా ఈ మొత్తాన్ని రైతులకు అందించేవారు. ఇచ్చిన మాట ప్రకారం క్యాలెండర్ తేదీ మేరకు రైతు భరోసా సొమ్ము రైతుల ఖాతాల్లో పడిపోయేది. దీంతో రైతులకు అప్పుల బాధ తప్పేది. రైతుల ఎంపిక కూడా అప్పటిలో వలంటీర్ల సహకారంతో జరిగేది. వలంటీర్లు ఇంటింటికీ తిరిగి రైతుల వివరాలు సేకరించి రైతు భరోసా పథకం కోసం అవసరమైన చర్యలు చేపట్టేవారు.

కూటమి హామీ అమలు గాల్లో..

కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే ఏటా వ్యవసాయ పెట్టుబడుల కింద ప్రతి రైతుకు రూ.20 వేల మేర సాయం అందజేస్తామంటూ హామీ గుప్పించారు. సీజన్‌కు ముందు ఈ సొమ్మును దఫదఫాలుగా అమలు చేస్తామంటూ ఎన్నికల ముందు ఊకదంపుడు ప్రచారం చేసుకొచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇంతవరకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయకపోవడంపై రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఇచ్చిన సమయాలు కూడా మారుతూ వచ్చాయి. దీంతో ఈ పథకం ఎప్పుడు అమలు చేస్తారో అని రైతులు ఎదురు చూస్తున్నారు.


సచివాలయంలో ఈకేవైసీ చేసుకుంటున్న రైతులు(ఫైల్)

17,536 రైతు ఖాతాల గుర్తింపు

మండల వ్యాప్తంగా పంటల సాగు చేపట్టే రైతుల ఖాతాలు 17,536గా అధికారులు నిర్ధయించారు. రైతుకు సంబంధించి ఈకేవైసీలను స్థానికంగా ఉన్న సచివాలయాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల ద్వారా చేపట్టారు. అన్నదాత సుఖీభవ పథకం అమలు కావాలంటే ఈకేవైసీ తప్పనిసరి చేసింది. దీంతో రైతులు ఆయా సేవా కేంద్రాలకు వెళ్లి అధికారులకు రికార్డులు అందజేసి ఈకేవైసీ చేయించుకున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మండల వ్యాప్తంగా 7,600 మంది రైతులను రైతు భరోసా పథకం కింద గుర్తించి వారికి నగదును నేరుగా బ్యాంక్ అకౌంట్‌లో జమ చేశారు. ప్రస్తుతం ఎంత మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందో అధికారుల వద్ద కూడా పూర్తి సమాచారం లేదు.

సాగుకు అప్పులు తప్పడం లేదు..



వ్యవసాయ పెట్టుబడుల కింద ఏటా సాయం చేస్తామంటూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇంత వరకు అమలుకు నోచుకోలేదు. గతేడాది పెట్టుబడి సాయం అందలేదు. ఈ ఏడాది ఇప్పటికే పథకం అమలుకు పలు తేదీలు ప్రకటించి వాయిదా వేశారు. ఇలా అయితే సాగు కోసం అప్పులు చేయడం తప్పేటట్టు లేదు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమాని ఇచ్చిన మాట ప్రకారం పక్కాగా సాయం అందేది.

–నరాలశెట్టి సూర్యనారాయణ, రైతు, ఒంపోలు

రైతుల వివరాలు నివేదించాం..



అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. అర్హులైన రైతుల ఈకేవైసీ కూడా పూర్తిచేశాం. ఈ పథకం కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేల మేర పెట్టుబడి సాయం అందుతుంది. ప్రభుత్వం నుంచి ఈ పథకం అమలుకు త్వరలో శ్రీకారం చుట్టనున్నారు.

– సీహెచ్.జ్యోత్స్నకుమారి, మండల వ్యవసాయాధికారి

పరిశ్రమల్లో అప్రమత్తత అవసరం


సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్ పరమేశ్వరరావు

పాయకరావుపేట: పరిశ్రమల్లో పని చేసే సిబ్బంది అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్ పరమేశ్వరరావు సూచించారు. మండలంలోని డెక్కన్ ఫైన్ కెమికల్స్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ పరిధిలో శనివారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రంలోని సిగాచీ ఫార్మాలో ఇటీవల జరిగిన దుర్ఘటన నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ ఆదేశాల మేరకు ఎమర్జెన్సీ స్పందనను పరీక్షించేందుకు మాక్‌డ్రిల్ నిర్వహించామన్నారు. పరిశ్రమలో అత్యవసర సమయంలో తక్షణ స్పందన కోసం ఇలాంటి మాక్‌డ్రిల్‌లు ఎంతో కీలకమని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మాక్‌డ్రిల్ నిర్వహించడం ద్వారా ఉద్యోగులు అవగాహనతో స్పందించి ప్రాణాలను కాపాడుకోగలరన్నారు.

పర్యావరణంపై గొడ్డలి వేటు


పాదచారులకు, పశు పక్ష్యాదులకు నీడ నిస్తున్న భారీ వృక్షాలు


అభివృద్ధి పేరిట వందల సంవత్సరాల నాటి భారీ వృక్షాలను కొట్టి పడేసిన దృశ్యం

అచ్యుతాపురం రూరల్ : అభివృద్ధి పేరుతో పర్యావరణంపై గొడ్డలి వేటు పడుతోంది. కాలుష్యాన్ని అరికట్టే కల్పవృక్షాలు కనుమరుగవుతున్నాయి. వందల సంవత్సరాల నాటి భారీ వృక్షాలను అవలీలగా క్షణ కాలంలో కొట్టి పడేస్తున్నారు. అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వెళ్లే రహదారి మధ్యలో ఉన్న భారీ చెట్లను రోడ్డు విస్తరణ కోసం యథేచ్ఛగా నరికివేస్తున్నారు. రోడ్డు విస్తరణ అనంతరం తిరిగి మొక్కలు నాటి అభివృద్ధి చేస్తే ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయి. కానీ అంతటి వృక్షాలు ఏర్పడాలంటే ఎన్నో సంవత్సరాలు ఎదురు చూడాల్సిందే. సెజ్ పరిశ్రమలు రాకముందు దారి పొడుగునా భారీ వృక్షాల కింద పాదచారులు ఎండ తీవ్రతకు సేద తీరుతూ ఇళ్లకు చేరుకునేవారు. దారి పొడుగునా వృక్షాలు ఉండడంతో అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వెళ్లేంత వరకూ ఒక టెంట్ వేసినట్లుగా ఉండేది. ఈ వృక్షాలను ఆధారంగా చేసుకుని పశు, పక్ష్యాదులు జీవనం సాగించేవి. ప్రస్తుతం వాటికి గూడు, నీడా లేకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి


ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

నర్సీపట్నం : పెంచిన విద్యుత్ చార్జీలను వ్యతిరేకిస్తూ సీపీఐ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసనలో భాగంగా నర్సీపట్నం ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు శనివారం ఆందోళన నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగించడాన్ని వెంటనే ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆదానీతో చేసుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాలు వెంటనే రద్దు చేసుకోవాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే నాలుగుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారన్నారు. ఈ సర్దుబాటు చార్జీల పేరుతో మొత్తం రూ.15485 కోట్ల భారాన్ని సామాన్య ప్రజానీకంపై మోపిందన్నారు. ఈ భారం రాబోయే 25 ఏళ్లకు రూ.లక్షా పదివేల కోట్లు భారం పడుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్‌మీటర్ల బిగించే కార్యక్రమాన్ని తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గొల్లు గురుబాబు, ఎం.లక్ష్మి, జి.రాధాకృష్ణ, అర్జునరావు, మేకా భాస్కరరావు, భవాని, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ అప్పన్నదొర, రైతు సంఘం జిల్లా నాయకులు పులగం రమణాజీ, మర్రి అప్పలనాయుడు, ప్రజానాట్యమండలి నాయకులు శెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని ఆర్టీసీ కార్మికుల ధర్నా


ఆర్టీసీ డిపో గేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్: ఆర్టీసీలో ఆరేళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు పదోన్నతులను తక్షణమే కల్పించాలని జోనల్ అధ్యక్షుడు కె.జె. సుధాకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో గేట్ వద్ద ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం భోజన విరామ సమయంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు పెండింగ్ బకాయిలను చెల్లించాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే వేయాలని, ఆర్టీసీలో ఖాళీ నియామకాలను వెంటనే చేపట్టాలని, 1–19 సర్క్యులర్‌కు విరుద్ధంగా ఇచ్చిన పనిష్మెంట్ ఆర్డర్స్ రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో మెయింటనెన్స్ రాష్ట్ర కమిటీ మెంబర్ ఎస్.వి. రమణ, ఏపీజేఏసీ అమరావతి మహిళా జిల్లా కార్యదర్శి కె. లక్ష్మీరమణి, జిల్లా ప్రచార కార్యదర్శి బి.ఎస్. రావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: యలమంచిలి మండలం పురుషోత్తపురం 33కేవీ విద్యుత్ ఉపకేంద్రం, పద్మనాభరాజుపేట ఫీడర్ పరిధిలో ఆర్‌డీఎస్‌ఎస్ పనుల కారణంగా పులపర్తి, పీఎన్ఆర్ పేట, బయ్యవరం గ్రామాల్లో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి, అందుకు తగినట్టుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన కోరారు.

అలరించిన అన్నమాచార్య కీర్తనలు


అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులోని జగన్నాథుని ఆలయ ప్రాంగణంలో శనివారం రాత్రి భక్తులు ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు అలరించాయి. జగన్నాథుని ఉత్సవాల్లో భాగంగా తిమ్మరాజుపేటకు చెందిన కళాకారులు ఈ ప్రదర్శన నిర్వహించారు. ఆలయ చైర్మన్ బొడ్డేడ జగ్గారావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

లోక్ అదాలత్‌లో 784 కేసుల పరిష్కారం


అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు షీయాజ్ ఖాన్, శ్రీభరణి

నర్సీపట్నం : లోక్ అదాలత్‌లో వివిధ రకాలకు సంబంధించిన 784 కేసులు పరిష్కారమయ్యాయి. స్థానిక కోర్టు సముదాయంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో సామరస్య పూర్వక వాతావరణంలో కేసులను పరిష్కరించుకునేందుకు అధిక సంఖ్యలో కక్షిదారులు హాజరయ్యారు. అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి పి.షీయాజ్‌ఖాన్, జూనియర్ సివిల్ జడ్జి శ్రీ భరణి కేసులను పరిష్కరించారు. అదాలత్‌లో ఇచ్చే తీర్పులు సుప్రీంకోర్టు తీర్పులతో సమానమని సీనియర్ సివిల్ జడ్జి పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా ఇరు వర్గాలకు భేదాభిప్రాయాలు ఉండవన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి


సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆటో జాతా ప్రచారం

అచ్యుతాపురం రూరల్ : ఈ నెల 9న జరిగే దేశ వ్యాప్త కార్మిక, రైతు సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం మండలంలో సెజ్ కాలనీ, ఫార్మా పరిశ్రమలు, తిమ్మరాజుపేట, హరిపాలెం గ్రామాల్లో ఆటో జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనాల చట్టం అమలు చేయాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్ కింద మార్చడం అన్యాయమన్నారు. వీటిని నిరసిస్తూ దేశంలో ఉన్న అన్ని కార్మిక, రైతు సంఘాలు సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, రైతు సంఘం నాయకుడు కర్రి అప్పారావు, కౌలు రైతు సంఘం నాయకులు కె.రామసదాశివరావు, యూనియన్ మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు, ఆటో యూనియన్ నాయకులు తట్టా రాజు, రామునాయుడు, సత్తిబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు ఉపమాకలో తొలి ఏకాదశి పూజలు


ఉపమాక వేంకటేశ్వరస్వామి వారు

నక్కపల్లి: తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు తెలిపారు. ఉదయం 5 గంటలకు కొండపై మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం జరుగుతుందన్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 వరకు భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. విరామం అనంతరం తిరిగి సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు దర్శనాలు ఉంటాయన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు భక్తులతో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ కార్యక్రమం జరుగుతుందన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి ఉపమాకకు చెందిన శ్రీనివాస భక్త సమాజం వారిచే ఉపమాక గరుడాద్రి పర్వతం చుట్టూ గిరి ప్రదక్షిణ జరుగుతుందన్నారు. రాత్రి 7 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక భజన కార్యక్రమాలు ఉంటాయని ప్రసాదాచార్యులు తెలిపారు.

మెనూ చార్జీలు, జీతాలు చెల్లించాలి


ఎ.కోడూరులో మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న నాయుడుబాబు

కె.కోటపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు జీతాలతో పాటు మెనూ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఈర్లె నాయుడుబాబు అన్నారు. కె.కోటపాడు, ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయుడుబాబు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను దృష్టిలో ఉంచుకోని మెనూ చార్జీల ధరలను పెంచాలని ఆయన కోరారు. ఈ నెల 9న చేపడుతున్న దేశ వ్యాప్త సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని నాయుడుబాబు కోరారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిలిపివేయండి


వడ్డాది ఏఈ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగిన కార్మిక సంఘ నాయకులు

బుచ్చెయ్యపేట : అధిక విద్యుత్ బిల్లులతో పేద ప్రజల నడ్డి విరుస్తున్న స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణం నిలిపివేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వడ్డాది విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ సీపీఐ నాయకులు, పలు కార్మిక సంఘ నాయకులు నిరసనకు దిగారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల ఇంట్లో ఒక బల్బు, ఫ్యాన్, చిన్న టీవీ ఉన్న పలువురు నిరుపేదలకు కూడా రూ.వేలల్లో బిల్లులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం అదాని కంపెనీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని, వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని ఆందోళన చేశారు. అనంతరం విద్యుత్‌శాఖ ఏఈ రాజుకు వినతి పత్రం అందించారు. కార్మిక సంఘ నాయకులు రావాడ వరహాలు, వర సూరిబాబు, ముత్యాలు, రావాడ నాయుడు, ఎర్రి నాయుడు పాల్గొన్నారు.

45 సీసాల మద్యంతో ఇద్దరు అరెస్టు


పట్టుకున్న మద్యంతో ఎక్సైజ్ పోలీసులు

ఎస్.రాయవరం : భీమవరం గ్రామంలో బెల్టు దుకాణానికి అక్రమంగా మద్యం తలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని 45 సీసాలు స్వాదీనం చేసుకున్నట్టు పాయకరావుపేట ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. అడ్డురోడ్డు నుంచి భీమవరం మీదుగా మద్యం తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో పట్టుకున్నట్టు చెప్పారు. ఈ మద్యం తరలిస్తున్న వారిలో భీమవరం, దార్లపూడి గ్రామానికి చెందిన ఇరువురు వ్యక్తులు ఉన్నట్టు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి యలమంచిలి కోర్టుకి తరలించామన్నారు.

యర్రయ్య కుటుంబానికి పరామర్శ

అచ్యుతాపురం రూరల్ : సముద్రంలో గల్లంతైన మత్స్యకారుడు బోడిపల్లి యర్రయ్య కుటుంబాన్ని యలమంచిలి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ శనివారం పరామర్శించారు. యర్రయ్య కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. నావికాదళ సహాయంతో సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.